క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ...



చీపురుపల్లి రూరల్ (గరివిడి) : వెన్నుపోటు దినం పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గుర్ల: పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్(గరివిడి)/గుర్ల: కూటమి ఏడాది పాలనను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల నాలుగో తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు గరివిడి, గుర్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయాలలో శనివారం ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, జి.శ్రీరాములనాయుడు, పొన్నాడ కుమార్, గుడివాడ తిమ్మనాయుడు, శీర అప్పలనాయుడు, పొట్నూరు సన్యాసిరావు, కేవీ సూర్యనారాయణరాజు, జమ్ము స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం పరిశీలన



వార్డెన్‌తో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ విజయరాజ్‌కుమార్

దత్తిరాజేరు: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని గజపతినగరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ. విజయరాజ్‌కుమార్ శనివారం పరిశీలించారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, వంట గది పరిశీలించారు. ఆయన వెంట పెద మానాపురం ఎస్సై ఆర్.జయంతి, వార్డెన్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులతో క్యాన్సర్ ..



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ హేమలత, వైద్య సిబ్బంది

గంట్యాడ: పొగాకు ఉత్పత్తులు తినడం వల్ల, పొగ తాగడం వల్ల గొంతు, నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని గంట్యాడ పీహెచ్‌సీ డాక్టర్ హేమలత తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా పీహెచ్‌సీ నుంచి ఎస్సీ కాలనీ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

వేపాడ: మండలంలోని నీలకంఠరాజుపురం ఎస్సీ, ఎస్టీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు శనివారం పరిష్కరించారు. 'తాగునీటి సమస్య పరిష్కరించండి' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈఓపీఆర్‌డీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు, తదితరులు కాలనీలో పర్యటించి మరమ్మతులు చేయించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గజపతినగరం: ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ప్రశాంతమైన జీవనం గడపవచ్చని ప్రముఖ యోగా శిక్షకుడు సుభాకర్ రాజు తెలిపారు. యోగా శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగా సాధనతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేయవచ్చన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం



స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: మండలంలోని గేదెలపేటలో అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

రైతుకు దక్కని భరోసా..

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా విత్తనాల ఊసే లేదు
- అటకెక్కిన అన్నదాత సుఖీభవ పథకం
- మాయమైపోయిన ఉచిత పంటల బీమా పథకం
- గత ప్రభుత్వంలో సకాలంలో విత్తనాలతో పాటు పెట్టుబడి సాయం



వరి నారు మడి కోసం దుక్కు చేస్తున్న రైతు



కళ్లేపల్లిలో రైతుసేవా కేంద్రం చుట్టూ పేరుకుపోయిన తుప్పలు

శృంగవరపుకోట నెట్‌వర్క్: ఆరుగాలం కష్టనష్టాలకు ఎదురొడ్డి కాయకష్టం చేసే కర్షకులకు అండగా నిలిచింది నాటి జగనన్న సర్కారు. రైతులను గాలికొదిలేసి కూలుతున్న రైతాంగానికి కనీస సాయం అందకుండా చేస్తోంది నేటి కూటమి సర్కారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఖరీఫ్ సాగుకు ముందుగానే రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయం రైతు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేవారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ ఉంచి రైతులకు అందజేశారు. ఇదిలా ఉంటే కూటమి సర్కారు కొలువుదీరి ఏడాది పూర్తయినా రైతులకు చేసింది శూన్యం. ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర కల్పనలో విఫలమైన సర్కారు ఇప్పుడు మరో మారు మొండిచేయి చూపుతోంది. రైతుభరోసా కేంద్రాల పేరును రైతుసేవా కేంద్రాలుగా మార్చడమే తప్ప రైతులను పట్టించుకున్న దాఖలాలు లేవు. నైరుతి రాకతో వర్షాలు కురుస్తున్న తరుణంలో రైతులు విత్తనాల కోసం ఎదురుచూస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. శృంగవరపుకోటలో 450 మంది, జామి–1015, వేపాడ–302, లక్కవరపుకోట–294, కొత్తవలసలో 307 మంది రైతులు ఖరీఫ్ సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు.

గతంలో ధైర్యంగా వ్యవసాయం చేశాం..



గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే ముందుగానే పెట్టుబడి సాయం అందించేవారు. ఎరువులు, విత్తనాలను రైతుభరోసా కేంద్రాల ద్వారా ఇంటి వద్దకే అందించేవారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నేటికీ విత్తనాల జాడ కనిపించడం లేదు. పెట్టుబడిసాయం మాటే లేదు. నాయకుల మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి.

– భూమిరెడ్డి స్వామినాయుడు, రైతు, లచ్చింపేట గ్రామం, లక్కవరపుకోట మండలం

మాటలే చెబుతున్నారు..



కూటమి నేతలు మాటలు చెబుతున్నారే తప్ప చేతల్లో కానరావడం లేదు. రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం అందించాలి. చంద్రబాబు ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా నేటికీ విత్తనాలు, ఎరువుల జాడే లేదు. సాగు ఎలా చేపట్టాలో అన్నదాతలకు అర్థం కావడం లేదు.

– గాడి అప్పారావు, రైతు కూలీ సంఘ జిల్లా అధ్యక్షుడు

కూటమి తెచ్చిన ఖరీఫ్ కష్టాలు..

నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు	రైతుభరోసా సాయం (గతంలో అందినది)
చీపురుపల్లి	12,400	7,500	రూ.9.75 కోట్లు
గరివిడి	13,200	10,200	13.26
మెరకముడిదాం	9,200	7,450	9.68
గుర్ల	11,600	24,500	రూ.31.85 కోట్లు

చీపురుపల్లి: ఖరీఫ్ సీజన్ ఆసన్నమయ్యే సరికి విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి సాయం అందించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అన్నదాతలకు ఖరీఫ్ కష్టాలను రుచి చూపిస్తోంది. ఇంతవరకు విత్తనాలు, ఎరువులు ఇవ్వకపోవడంపై అన్నదాతల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఖరీఫ్, రబీ సీజన్‌లు రాకముందే విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాలకు చేరిపోయేవి. అలాగే రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయం ఠంచన్‌గా రైతు ఖాతాలకు జమయ్యేది.

నియోజకవర్గంలో 46,400 ఎకరాల్లో సాగు విస్తీర్ణం..

నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో 46,400 ఎకరాల్లో ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఉంది. ఖరీఫ్‌లో ప్రధానంగా వరి పంట సాగు చేయనున్నారు. అంతేకాకుండా నాలుగు మండలాల్లో 27,600 మంది రైతులు పెట్టుబడి సాయానికి అర్హత కలిగి ఉన్నారు. అయితే ఇంతవరకు ఒక్క రూపాయి కూడా రైతుకు అందలేదు.

విత్తనాల జాడ కరువు..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 46,400 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పెసర, మినుము, చెరకు వంటి పంటలు రైతులు పండిస్తారు. గత ప్రభుత్వంలో మే నెలలోనే అవసరమైన విత్తనాలు రైతుభరోసా కేంద్రాలకు చేరేవి. ప్రస్తుత ప్రభుత్వంలో మాత్రం ఇంతవరకు విత్తనాలు చేరలేదు. అందులో భాగంగానే చీపురుపల్లి మండలానికి సంబంధించి 1400 క్వింటాళ్ల విత్తనాలు ఇండెంట్ పెడితే ఇంతవరకు 350 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. అలాగే మెరకముడిదాం మండలంలో 1900 క్వింటాళ్ల విత్తనాల కోసం ఇండెంట్ పెట్టగా ఇంతవరకు ఒక్క బస్తా కూడా రాలేదు. గరివిడి మండలంలో 1500 క్వింటాళ్ల విత్తనాలు ఇండెంట్ పెట్టగా 550 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. అలాగే గుర్ల మండలంలో 2400 క్వింటాళ్ల విత్తనాలకు ఇండెంట్ పెట్టగా 2100 క్వింటాళ్లు చేరుకున్నాయి.

ఎలాంటి సాయం అందలేదు



ఖరీఫ్ ఆసన్నమైనప్పటికీ ఇంతవరకు ఎలాంటి సాయం అందలేదు. గత ప్రభుత్వంలో ప్రతి ఏటా రూ.13 వేలు రైతుభరోసా కింద జమయ్యేది. ఆ డబ్బులు ఎంతగానో ఉపయోగపడేవి. ఇప్పుడు ఖరీఫ్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేకపోవడంతో పెట్టుబడి కోసం అప్పులు చేసుకోవాల్సి వస్తోంది. గత ప్రభుత్వంలో ఉన్న ఉచిత పంటల బీమా పథకాన్ని కూడా తొలగించి మరింత భారాన్ని పెంచారు.

– ఎస్.అప్పలనాయుడు, ఆనందపురం, గుర్ల మండలం

అప్పులు చేయక తప్పదు..



వర్షాలు కురుస్తున్నాయి. ఇక విత్తనాలు నాటుకోవాల్సి సమయం వచ్చింది. కానీ ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తామన్నారు. కానీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. వరి సాగులో పెట్టుబడి కోసం అప్పులు చేసుకోక తప్పడం లేదు. గత ప్రభుత్వంలో వర్షాలు కురిసే సమయానికి పెట్టుబడి సాయం ప్రభుత్వం అందించింది.

– యజ్జిపురపు అప్పలనాయుడు, దుమ్మెద, గరివిడి మండలం

అన్నదాతకు కన్నీరే..



దుక్కులు చేపట్టిన భూమి



వంగరలోని రైతుభరోసా కేంద్రం

దత్తిరాజేరు: తాము అధికారంలోకి వస్తే అన్నదాతలకు అన్నివిధాలుగా ఆదుకుంటామని కూటమి నాయకులు గొప్పలు చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇంతవరకు విత్తనాలు, ఎరువుల మాటే ఎత్తడం లేదు. ఇప్పటికై అన్నదాత సుఖీభవ పథకం కింద అందించాల్సిన రూ. 20 వేలు కూడా ఇవ్వలేదు. అన్నదాతలు అప్పుల కోసం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఎరువులు, విత్తనాలు గ్రామంలోనే అందించగా.. పండిన పంట కూడా కళ్లంలోనే కొనుగోలు చేసేవారు. రైతుభరోసా కింద సాయం కూడా ప్రతి ఏడాదీ అందించారు. అప్పట్లో వ్యవసాయం పండగలా ఉంటే.. నేడు అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి.

గత ప్రభుత్వం అండగా ఉండేది..



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉండేది. రైతులకు విత్తనాల నుంచి విక్రయించే వరకు అన్ని పనులూ రైతుభరోసా కేంద్రాల ద్వారా సాగేవి. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. రైతును పట్టించుకున్న పాపాన లేదు.

– ఈదుబిల్లి నరసింగరావు, రైతు, చౌదంతివలస

రైతుభరోసా అందేది..



రైతులను ఆదుకోవాలనే ముందు చూపుతో గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రైతుభరోసా కింద పెట్టుబడి సాయం కింద రూ. 13 వేలు క్రమం తప్పకుండా అందించారు. ప్రస్తుతం రైతులను ఆదుకున్న నాథుడే లేడు.

– తాళ్లపూడి అప్పలనాయుడు, రైతు, రోళ్లవాక, బొండపల్లి మండలం

రోడ్డెక్కాల్సి వచ్చింది..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏ పంట పండించాలన్నా పెట్టుబడి సాయం ముందే అందేది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా రైతులకు గురించి పట్టించుకున్న దాఖాలు లేవు. ఎరువులు, విత్తనాల కోసం రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది.

లచ్చిరెడ్డి క్రిష్ణ లక్కిడాం,గంట్యాడ మండలం

వెన్నుపోటు వెన్నతో పెట్టిన విద్య



వెన్నుపోటు దినం పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- చంద్రబాబు మోసాలపై జూన్ 4న వెన్నుపోటు దినం
- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం

చీపురుపల్లి: నమ్మిన వారికి వెన్నుపోటు పొడవడం చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు సంవత్సరం పూర్తయినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 4న వెన్నుపోటు దినం పేరిట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ మెంబర్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, బెల్లాన త్రినాథరావు, దన్నాన జనార్దనరావు, కరిమజ్జి శ్రీనివాసరావు, పతివాడ రాజారావు, అధికార్ల శ్రీనుబాబు, రఘుమండ త్రినాథ, పనస అప్పారావు, కొమ్ము చిరంజీవి, బాణాన శ్రీను, రమణ, ఇప్పిలి గోవింద, మీసాల రమణ, ముల్లు పైడిరాజు, కోరుకొండ దాలయ్య, రేవల్ల సత్తిబాబు, కొసిరెడ్డి రమణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే సర్కారు ధ్యేయం

శృంగవరపుకోట: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని శివరామరాజుపేటలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, కూటమి ప్రభుత్వం హయాంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సుధారాజు, సోమేశ్వరరావు, జీఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల వ్యాన్ సీజ్

దత్తిరాజేరు: పెదమానాపురం సంత నుంచి వైజాగ్‌కు అక్రమంగా పశువులను తరలిస్తున్న బొలేరో వ్యాన్‌ను శనివారం సీజ్ చేసినట్లు పెదమానాపురం ఎస్సై ఆర్.జయంతి తెలిపారు. వ్యాన్‌లోని ఆరు పశువులను విడిపించి, వ్యాన్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సంత వద్ద తనిఖీలు చేపడుతుండగా.. వ్యాన్ పట్టుబడిందన్నారు.

కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు

- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల జోలికొస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హెచ్చరించారు. మండలంలోని గొట్లాంలో గల సత్య ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ నియోజవర్గ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని మండలాల్లో కూడా తహసీల్దార్లు డోర్లు మూసివేసి విధులు నిర్వహిస్తున్నారని.. ఇటువంటి పరిస్థితి గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ లేదన్నారు. కూటమి నాయకులు చెప్పిన వారికే మాత్రమే అధికారులు పనులు చక్కపెడుతున్నారని.. ఇదే ఒరవడి కొనసాగితే అధికారులు నష్టపోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో పార్టీలకతీతంగా అర్హతను ప్రామాణికంగా తీసుకుని పనులు చేపట్టగా.. నేడు కూటమి నాయకులు చెప్పిన వారికే పనులు జరుగుతున్నాయని తెలిపారు. సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా ఈనెల నాలుగో తేదీన వెన్నుపోటు దినం నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం నిరసన దినం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బి.జ్ఞానదీపిక, చల్లా చలంనాయుడు, పీరుబండి హైమావతి, ఎస్.అరుణ, గార తవుడు, వర్రి నరసింహమూర్తి, గొర్లె సరయు, బూడి వెంకటరావు, బొద్దల చిన్నంనాయుడు, రాపాక కృష్ణార్జున, గొర్లె రవికుమార్, మీసాల తులసీరాం, మహంతి రమణ, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గను దర్శించుకున్న మజ్జి, బొత్స



యాగశాలలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య



అమ్మవారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

గంట్యాడ: మండలంలోని కొటారుబిల్లి జంక్షన్‌లో కనకదుర్గ ఆలయాన్ని పునర్నిర్మించి, అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అమ్మవారిని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు వర్రి నరసింహమూర్తి, పీరుబండి జైహింద్‌కుమార్, సర్పంచ్ వేమలి రమణమ్మ, వేమలి ముత్యాలనాయుడు, జాగరపు అప్పారావు, వెలగాడ రామసూర్యం, నారాయణమూర్తి రాజు, లచ్చిరెడ్డి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో వర్షం..

చీపురుపల్లి: పట్టణంలో శనివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ వల్ల ఉక్కబోతతో అవస్థలు పడిన ప్రజలు వర్షానికి కాస్త సేదదీరారు. వరుస రెండు రోజుల్లో వర్షం కురడంతో వాతావరణం చల్లబడింది.ఈ వర్షాలు ఖరీఫ్ సాగుకు అనుకూలమని రైతులు చెబుతున్నారు.